# పొడిమేఘం - పెనుగాలి

స్తామములావుందది. పసిరికలో చచ్చిపడ్డట్టు చలనంలేదు. అటూ యిటూ గొడుగుల్లాంటి చెట్లు, ఆ గొడుగుల్లో లెక్కించలేనన్ని బీదతనపు చిరుగులున్నాయి. వెన్నెల సూదుల్లా గుచ్చుకొంటోంది. కింద కొండ చిలువ ఒంటిమీదున్నట్టు మచ్చలు. సన్నటి తోక ఆచివర సీతాఫలతుప్పల్లో చీకట్లో మాయమయిపోయింది. వెన్నెముకను విరిచేసినట్టు నడుమంతా మెలికలు తిరిగిపోయింది. తల అర ఫర్లాంగుదూరంలో వెలుతుర్లో జిగేల్ మంటోంది. మృత్యుస్థానమది! తలమీద మాణిక్యం మిరుమిట్లు గొలుపుతూ దారిచూపుతోంది. చీకట్లను వెనక్కు నెట్టేస్తోంది. ముందువైపు అంతా వెలుగే. వెనక భయంకరమైన చీకటి!

ఆ చీకట్లో మృత్యువు పొంచివుంది. దురదృష్టవంతు లెవరో దాని బారిన పడతారు. విడిపించుకోవడానికి వీల్లేకుండా వాళ్లను చుట్టబెట్టేస్తుంది. తెలివిగలవారు తప్పించుకుంటారు. లేనివాళ్లు కళ్లుమూస్తారు. కసికొద్దీ సూదుల్తో పొడిచి పొడిచి ప్రాణాలు తీసేస్తుంది.

అకస్మాత్తుగా తోకదగ్గర ఏదో కదలిక కనిపించింది. తెల్లటి ఆకారం కదలి వస్తోంది. సర్పం తన ఆకారాన్ని విడిచిపెట్టి, నాగకన్యలా మారి కదలి వస్తున్నట్లుంది. సన్నగావుంది ఆకారం. మెలికలు తిరిగిపోతోంది. జిగేల్ జిగేల్ మన్న మెరుపు! మాణిక్యం తలమీదదికాదు. కంఠం దిగువన మెళ్ళోది! నక్షత్రంలా మెరుస్తోంది. లేత నీలంరంగు మెరుపు. నక్షత్రం పగిలి ఉల్కల వర్షం కురిసినట్లు నలువైపులకూ కాంతులు చెదిరి పోతున్నాయి.

నాగమణి ఆగిపోయి వెనక్కి తిరిగి చూసింది.

పాములా మెలికలు తిరిగిన బాట సీతాఫలమొక్కల్లో మాయమయి పోయింది.

ఓసారి గట్టిగా నిట్టూర్చి ముందుకు తిరిగింది నాగమణి. ఎట్ట ఎదుట మృత్యుగహ్వరం! చాలా విశాలంగా, ఎత్తుగా వుంది. కొన్నివందల జీవితాలను పొట్టన బెట్టుకున్నా ఇంకా ఆకలితో నోరుచాచి చూస్తున్నట్టు వుంది హాస్పిటలు వార్డు! వార్డు ముందు అరవైవాట్ల బల్బు తెల్లగా మాణిక్యంలా వెలిగి పోతోంది.

"గుడ్‌నైట్ సిస్టర్! అక్కడే నిలబడిపోయారేం" అన్నాడు ఓ రోగి.

నాగమణి ప్రతిగా గుడ్‌నైట్ చెప్పింది. చిన్న చిరునవ్వు విసిరి, ఆ రోగి కిర్రలో ఆరిపోతున్న వత్తుల్ని పైకి ఎగదోసి, జ్యోతుల్ని నిలిపి, గబగబా మెట్లెక్కి లోపలికి వెళ్ళిపోయింది.

లోపల వార్డులో ఓ మూల హడావిడిగా వుంది. నాలుగు రోజుల కిందట ఖాళీ అయిన బెడ్‌మీద ఏ దురదృష్టవంతుడో మెలికలు తిరిగి పోతున్నాడు. నాలుగు రోజుల కిందటే విధిచేత వెక్కిరించబడ్డ వ్యక్తి ఒకడు అదే బెడ్‌మీద మృత్యువును కౌగలించుకొని నిద్రపోయాడు. ఇద్దరు డాక్టర్లూ, ముగ్గురు నర్సులూ, ఆ కౌగిలిని బలవంతంగా విడదీయడానికి ప్రయత్నించారుగాని లాభంలేకపోయింది. ఆ చుట్టూవున్న గుండెలు పిరికితనంతో బితుకు బితుకు మంటాయేమోనని హాస్పిటలు అధికారులు వెంటనే ఆ దృశ్యాన్ని చెరిపేశారు. ఆనవాళ్ళు లేకుండా లోషను నీళ్లతో శుభ్రంగా కడిగేశారు. అప్పటినుండీ అది ఖాళీగానే వుంది. అదే బెడ్‌మీద యివ్వాళ మరో దురదృష్టవంతుడు!

నాగమణి దగ్గరకువెళ్ళింది. డాక్టరు మేకుల్లాంటి సూదులుగుచ్చి ప్రాణాలు పారిపోకుండా బంధించే ప్రయత్నాలు చేస్తున్నాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగి, వత్తుల్ని తడిపి, జ్యోతుల్ని వెలగనీయకుండా ఆర్పేస్తాడేమోనని చుట్టూవున్న రోగులు ఆ దృశ్యాన్ని చూడలేక కళ్ళు మూసుకున్నారు. వింతగా దగ్గరకు చేరిన కుందేళ్ళు తాటాకు చప్పుళ్ళాంటి ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు జడిసి పారిపోయాయి. వార్డు బోయ్ కంగారు జంతువయ్యాడు. స్వీపర్ లేడిలా దుముకుతున్నాడు. ఎప్పుడూ నవ్వుతూ వుండే సిస్టర్ సువర్ణ కింద పెదివిని పంటితో నొక్కిపట్టుకుంది.

నాగమణి 'విష్' చేసింది. డాక్టరు దాన్ని అందుకోలేదు. ప్రాణం లేని యంత్రం టిక్కుటిక్కుతో రోగి హృదయ చలనాన్ని తదేకంగా పోలుస్తున్నాడు. మాటిమాటికీ గడియారం ముల్లుతో చూపుల్ని కట్టిపడేసి కాలాన్ని కొలుస్తున్నాడు. ప్రాణాన్ని శబ్దంలోకిమార్చి, ఆ శబ్దాన్ని గడియారంలో నింపి, ఔన్సు గ్లాసుతో మందు కొలిచినట్టు కొలుస్తున్నాడు. కాలం కదలడంలేదు. గడియారం మీదికెక్కి కూర్చుని, మత్తుగా ఆకుల మీంచి పాముజారినట్టు, మెల్లగా జారుతోంది.

దురదృష్టవంతుడు అదృష్టాన్ని తరిమేస్తున్నాడు. ఉండీ ఉండీ, చీకట్లో నల్లని మృత్యువునుచూసి జడుసుకుని పొలికేక పెట్టినట్టు అరుస్తున్నాడు. తల చితగ్గొట్టినపాము, ప్రాణం రాలిపోయేముందు గింజుకున్నట్టు మెలికలు తిరిగిపోతున్నాడు. నాగమణి సువర్ణ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది.

లేబరేటరీలో కోనికల్ ఫ్లాస్కులో డైల్యూట్ హైడ్రోక్లోరిక్ ఏసిడ్‌వుంటే మంచి నీళ్ళనుకుని తాగేశాడట. సాయంకాలం స్టమక్‌వాష్

యిచ్చి చూశారట. పేగుచ్చి బాగా తినేసిందేమో అందుకే అలా అరుస్తు న్నాడు — అంది సువర్ణ.

డాక్టరు చూపులు మార్చుకుని, చెమట తుడుచుకుని తేలిగ్గా ఊపిరి తీసి విడిచాడు. మార్ఫియా ఇంజక్షనిచ్చి, చేతులు కడుక్కొని అవసర మైతే పిలవమనిచెప్పి వెళ్ళిపోయాడు. సువర్ణకూడా వెళ్ళిపోయింది, నిర్దయగా రాత్రిని ఒంటరిగా నాగమణికి వదిలేసి గుడ్‌నైట్‌చెప్పి చీకట్లో సన్నని బాటలోంచి క్వార్టర్సుకు వెళ్ళిపోయింది.

నాగమణిముందు రాత్రి మిగిలిపోయింది.

డ్యూటీ రూంలో కూర్చొని కిటికీలోంచి చీకటిని చూస్తోంది.

బయట సన్నగా వర్షంతుంపరకూడా పడుతోంది గాబోలు గాలి చల్లగా, తెరలు తెరలుగా వీస్తోంది. ఉండి వుండి ఒక్కొక్క వర్షంబొట్టు కిటికీలోంచి పాదాల మీదకు వాలుతోంది. వార్డంతా నిశ్శబ్దంగా వుంది. రోగులు నిద్రపోతున్నారు. ఏ అలికిడీలేదు. కొత్తగా వచ్చిన దురదృష్ట వంతుడు మాత్రం మూలుగుతున్నాడు.

వర్షం ముదిరి పెద్దదయ్యింది. నీళ్లు కాలువలుకట్టి పారుతోన్న శబ్దం వినబడుతోంది. దూరంగా వీధి బయట వెలుగుతోన్న వీధి దీపాలు ఆరిపోయాయి. కాటుక కళ్ళతో ఏ స్త్రీయో భోరున ఏడుస్తున్నట్లుంది.

నాగమణి ఓమారు వార్డంతా తిరిగింది. జల్లు పడకుండా కిటికీల రెక్కలు మూసేసింది. వెనక్కు తిరిగివస్తూ దురదృష్టవంతుడి మంచం ముందు ఆగిపోయింది.

వార్డుమధ్యలో వెలుగుతోన్న ఒకే ఒక ఎలక్ట్రిక్ బల్బు నిద్రలేక

ఎర్రబడ్డట్టు లేత కాషాయరంగు కాంతిని పొదులుతోంది. దురదృష్టవంతుడి ముఖంలో రక్తాన్ని పిండుతోంది.

కణతలు పైకిఉబ్బి, చెంపలు పర్వత సానువుల్లా వాలుగా కిందకు జారి, గెడ్డం అడుక్కి దిగిపోయాయి. బలవంతానగాని తెరచుకోని రలు పుల్లా రెప్పలు గట్టిగా మూసుకుపోయివున్నాయి. కింద పెదవి దిగువలో చెక్కేసినట్టు పల్లం మరీ ఎక్కువై నీడపడుతోంది. మీసాల్లేవు. వెన్నెల రాత్రి నక్షత్రాలు దూరదూరంగా పరచుకున్న చోటచేరిన లేతనీలంరంగు కాంతి పల్చగా అలముకున్నట్లుంది. ముక్కు పుటాలు వుబ్బి, నిలువుగా చూసినప్పుడు తప్పటి ముక్కులా అనిపిస్తోంది. ఆ వుదయమే గెడ్డం గీసినట్టు, జారిపోయిన మంచుగడ్డమీద పచ్చగడ్డి ప్రతిఫలించిన విధంగా అస్పష్టంగా లేతపచ్చరంగు మెరుస్తోంది. గుండ్రటిగోళం వేడెక్కి, వ్యాకోచించి కిందకు బరువు దిగినట్టుంది కోలమొహం. బుష్కోటు బొత్తాంవూడి, చొక్కా పక్కకు తొలగి విశాలమైన పెయిరీ మైదానంలా ఛాతీ కనిపిస్తోంది. ఉండి వుండి పెదాలు జడుసుకున్న పిరికివాడిగుండెలా అదిరిపడుతున్నాయి. దగ్గరగా ముడుచుకుపోయి, అందమైన మైనపు బొమ్మ వేడికి కరిగి ముద్దగట్టుకు పోయినట్టు తనలో తనే అతుక్కుపోయాడు.

నాగమణి కళ్ళల్లో జాలి, కెరటాల అలల్లా ఊగులాడింది. 'పాపం!' అనుకుంది. డ్యూటీరూంలోకి వెళ్ళి, చలికి దగ్గరగా ముడుచుకొని నిద్రను తోలుకుంటూ ఆలోచనల్లో ఒంటరిగా తిరిగి, హృదయం బరువెక్కిన తర్వాత నిద్రపోయింది.

ఆమెకు తెలివొచ్చి అదిరి పడినట్లు కళ్ళు తెరిచింది. వార్డ్‌బోయ్ పిలుస్తున్నాడు. "ఆ కొత్త పేషంటు చాలా బాధపడుతున్నాడు సిస్టర్. ఒకసారివచ్చి చూసివెళ్ళండి" అన్నాడు.

నాగమణి విసుక్కుంది. నిద్రంతా చెడగొట్టేశాడు. మళ్ళీ నిద్ర పోవాలంటే ఎంత సేపు పడుతుందో. ఆలోచనల్లో మళ్ళీ ఎన్నిగాయాలు రేగుతాయో.

లేచి రోగిదగ్గరకు వెళ్ళింది. కార్చిచ్చులో చిక్కుపడ్డ పాములా మెలి కలుతిరిగిపోతున్నాడు. అరుస్తున్నాడు. ఆయాసపడిపోతున్నాడు. ఊపిరి కూడా సరిగా వెళ్ళడంలేదు. అచ్ఛాదనలేని జ్యోతి అల్లల్లాడినట్టు, జలపాతం కింద రాతిబండ కదలినట్టు స్థిరంగా వుండలేక యిష్టంవచ్చినట్టు కదలి పోతున్నాడు. కన్నీళ్ళు చెక్కిళ్ళను తడిపేశాయి. తడిసిన చెక్కిళ్ళమీద దీపంవెలుతురు అతుక్కుపోయింది. ఎక్కడుందో వాళ్ళమ్మ — ఆమెను తలంచుకుంటున్నాడు.

తలెత్తి చూశాడు. స్త్రీ ఎదుట చటుక్కున తను మగాడిననే విషయం జ్ఞాపకానికొచ్చింది. ఏడవకూడదనుకున్నాడు. మూలుగుని లోలోపలే అణిచేసుకోవాలనుకున్నాడు. కాని ఏమీ చేతకాలేదు. కన్నీళ్ళు కారిపోతూనేవున్నాయి. మూలుగు హృదయాన్ని చీల్చి బైటపడుతూనే వుంది. బుసకొడుతున్న నాగుపాము పడగకింద గడ్డిపూచ కంపించినట్టు కంపించిపోతూనే వున్నాడు.

"నొప్పి ఎక్కువగా వుందా?" అంది నాగమణి మళ్ళీ.

సమాధానం చెప్పే ఓపికకూడా లేదు. తల మాత్రం వూపాడు. ఆయాసపడుతూ "మంట .... కాలిపోతోంది .... అమ్మా...." అంటూ మూలిగాడు. గుండెను చూపించి అరిచేత్తో రాసుకుంటున్నాడు.

నాగమణి దగ్గరకు వెళ్ళింది. అరిచేత్తో మెల్లగా గుండెను రాసింది. వార్డ్‌బోయ్‌ని పిలిచి బ్రోమైడ్ తెమ్మని కొద్దిగా తాగించింది.

"కళ్ళు మూసుకోండి. నిద్రపడితే నొప్పి తగ్గుతుంది." అంటూ దుప్పటికప్పింది. స్టూలులాక్కుని అక్కడే కూర్చుంది—దురదృష్టవంతుడి నుదుట మొలిచిన అదృష్టపు రేఖల్ని చూస్తూ.

బయట యింకా బోరున వర్షం కురుస్తూనే వుంది. వాచీ చూసుకుంది. కాలం కదులుతున్నట్టనిపించడంలేదు. తడిసిపోయి, బరువెక్కి కదలలేనట్టు మందంగా కదులుతున్నట్టుంది. రోగి క్రమక్రమంగా నిద్ర తెరల్లో చిక్కుకుంటున్నాడు. నాగమణి నిద్రపోయాడని లేచి బయలుదేరింది. పదడుగులు వేసింది. ఆకాశంలో మెరుపు మెరిసి, క్షణంపాటు లోకాన్ని వెలిగించి ఆరిపోయింది. ఆ వెంటనే ఉరుము. గతుక్కుమంది. తర్వాత గుండె తడుముకొని నవ్వుకొంది.

దురదృష్టవంతుడి నిద్రఎగిరిపోయిందేమో, మూలుగు మళ్ళీ వినిపిస్తోంది. నాగమణికి విసుగేసింది. కోపంకూడా వచ్చింది. నిర్లక్ష్యంగా డ్యూటీరూంలోకి వెళ్ళిపోయింది. నైట్‌డ్యూటీ చెకింగ్‌వర్స్ వర్షం మూలాన "రౌండ్స్" కురాలేదు. రాత్రిళ్ళు సీరియస్‌కేస్‌వుంటే యింతే. నిద్ర వుండదు. ఒంటరిగా కూర్చోవాలి. ఆలోచనలు వస్తాయి. బాధాకరమైనవి. అంతేగాని గిలిగింతలు పెట్టేవేమీ లేవు తనకు. దురదృష్టవంతురాలు తను. తను నిర్లక్ష్యంగా విసిరేసిన అదృష్టపు ఫలాలు దారి పొడుగునా మొలిచి మొలకలై పెరిగి విశాలమైన వృక్షాలై చల్లని నీడల్నిస్తున్నాయిప్పుడు. ఆ నీడల్లో ఎవరెవరో సేద దీర్చుకుంటున్నారు. వెనక్కు వెళ్ళడానికి మనస్కరించడంలేదు. అభిమానంవల్ల ఆగిపోయింది. ఇప్పుడు ఆ నీడల్ని పూర్తిగా ఆక్రమించేశారు. ఖాళీలేదు - అలా అయిపోయింది బ్రతుకు.

ఆలోచనలు! ఆలోచనలు!!

ఎప్పుడో నిద్ర. కుర్చీలో కూర్చుని అలాగే టేబిలుమీదకు వాలి నిద్రపోయింది.

ఏదో కల తెగిపోయి చటుక్కున కళ్ళుతెరిచింది. స్నానం చేసిన ఉదయం తడిసిన కురుల్ని ఆరబెట్టుకొంటోంది. రాత్రల్లా ఏడ్చి ఏడ్చి కళ్ళెర్ర బడ్డట్టు ఆకాశం ఎర్రగావుంది. కన్నీళ్ళలో కాటుక చెరిగిపోయి చీకటి మాయమయ్యింది. పల్చటి లేతబూడిద రంగు కాంతి పచ్చిగా బయటపడుతుంది. ఎదుటి రావిచెట్టులో ఓ కాకి వుండి వుండి అరుస్తోంది.

ఈ స్వాగతం ఎవరికి? ఏ చుట్టానికి? హాస్పిటలు వార్డులోకి కొత్తగావచ్చే ఏ దురదృష్టవంతుడికో!

నాగమణి చెయ్యి ఝాడించింది. కాకి అరవడం మానేసి, రెక్కల్ని టపటపా కొట్టుకుని ఎగిరిపోయింది. ఓ పండుటాకు చెట్టుమీంచి రాలి, నగరం వెనక దిగబడిపోతోన్న సాయంకాలపు సూర్యుడి ఆఖరి కిరణంలాగ, పతనమైపోయిన సామ్రాజ్యపు బావుటాలాగ, పట్టుతప్పిన ఉల్కలాగ, దుర్బలుడికోపంలాగ, కన్నీటి బొట్టులాగ కిందపడిపోయింది.

'ఈ యవ్వనంలోనుంచి మరోరోజు రాలిపోయింది' అనుకుంది నాగమణి. నిట్టూర్చింది. లేచి తల సర్దుకుని, నలిగిపోయిన బట్టల్ని సరి చేసుకుని వార్డులోకి వచ్చింది.

దురదృష్టవంతుడు మత్తుగా కదలకుండా పడుకున్నాడు.

ఆమె భయంగా, కంగారుగా దగ్గరకు వెళ్ళింది.

నిద్రపోతున్నాడు. గుండెలమీద చేతులు వేసుకుని మత్తుగా నిద్ర పోతున్నాడు, శైశవంలోంచి కాంపు వెల్లువలో కొట్టుకుపోయి బురదలో

కప్పడి, యవ్వనంలో వచ్చిన బలమైన ఉద్రేకపు ఘూకంపంలో తిరిగి బయటపడిన కన్నీటి బిందువు ముత్యంలా చెక్కిలిమీద మెరుస్తోంది. ఊపిరి పీల్చినప్పుడు చేతులుకూడా గుండెతోపాటు పైకీ, కిందకూ కదులుతున్నాయి.

'హమ్మయ్య!' అనుకుంది.

కొద్దిక్షణాలు అతని ముఖంలోకి చూస్తూ నిలుచుంది.

రాత్రి బాధలో అందం కప్పడిపోయింది. బాగానే వున్నాడు. చీకట్లో మీసం కనుపించలేదప్పుడు. లేతమీసం. అక్కడక్కడ ముదర రాగిరంగులో మెరుస్తోంది. ఎర్రగులాబీ రసం పిండి, కాచి చిక్కబరచి, అందులో ముంచినట్టున్నాయి పెదాలు. తురాయిపూలు పొట్లాంచట్టిన సన్నటి, తెల్లటి కాగితపు పొరలోంచి కనిపించే శరీరపు రంగు అతనిది. బుగ్గలమీద మొటిమలు ఎర్రగా కంది, విచ్చిన గడ్డిపూలలా వున్నాయి. తల వెంట్రుకలు చెదరి ఉంగరాలు తిరిగి, ముసురుతున్న చీకట్లలా నలువైపులకు ఎగురుతున్నాయి ఎండకు పగిలి బీటలు వేసిన నేలలా నొసటి మధ్య పడుతున్న గీతలు హృదయంలో రగుల్కొంటున్న కార్చిచ్చులను చెప్పక చెప్తుతున్నాయి. ఎప్పుడూ ఎవ్వరికీ హృదయాన్ని యివ్వగూడదనుకున్నవాడిలా కలలోగూడా పెదాలమీద చిరునవ్వుల్ని దొర్లనీయడం లేదు.

"పాపం!" అనుకుంది నాగమణి వెనక్కు తిరిగిపోతూ. ఆతర్వాత నవ్వుకుంది. ఒక దురదృష్టవంతురాలు మరొక దురదృష్టవంతుడిమీద సానుభూతా?!

నాగమణి క్వార్టర్సుకివెళ్ళి ముఖం కడుక్కొచ్చింది. అప్పుడే

వార్డంతా నానా గందరగోళంగా తయారయ్యింది. మూలుగులు. అరుపులు. తిట్లు — ఒకటే కాకిగోల! వీళ్ళమధ్య సహనంతో ప్రవర్తించాలి. జీవితంలో అన్నీ జారవిడుచుకున్న తనకు సహనం మాత్రం యింకెక్కడ మిగిలింది? మరికొంతకాలం వీళ్ళమధ్యేగానివుంటే తనకి పిచ్చెత్తడం మాత్రం ఖాయం.

ఎనిమిదింటికి డ్యూటీ నర్సులు ముగ్గురొచ్చారు. నాగమణి డ్యూటీ దిగి క్వార్టర్సుకు బయలుదేరింది. పదింటికి భోజనంచేసి పడుకుంటే మళ్ళీ సాయంకాలం నాలుగింటికే లేవడం. నాలుగింటికి క్వార్టర్సులో రంగులు విచ్చుల విడిగా ఎగురుతుంటాయి. తమకు కావలసిన వాళ్ళ గురించి ఆకారాలు మార్చుకుని ఎదురు చూస్తుంటారు అమ్మాయిలు. కొంతమంది షికార్లు కొడుతుంటారు. అబ్బాయిల ఖరీదైన నవ్వులు క్వార్టర్సులో నాపరాతి గచ్చుమీదపడి అటూ యిటూ జారిపోతుంటాయి. వాటిని అమ్మాయిలు ఏరుకొని, భద్రంగా దాచుకుని రాత్రి కలల్లోకి తెచ్చుకుంటారు.

ఆ జీవితంలో వాళ్ళమాదిరే తనూ కొంత కాలం గడిపింది. సాయంకాలాల గురించి ఎదురుచూస్తూ కూర్చునేది. ఎన్నో చిరునవ్వుల్ని ఏరుకుని పిసినారిలా మూటగట్టి దాచుకుంది. అవి చాలలేదు. ఇంకా కావాలి. ఆశకు అంతులేదు. ఒక్కరుకాదు యిద్దరు. ఆ తర్వాత ముగ్గురు. తను కోరితే తన వెనక ఓ మహాసైన్యం తయారవుతుంది. ఆ అహంకారమే తనలో నిర్లక్ష్యాన్ని రేకెత్తించింది. అన్నింటినీ పోగొట్టుకొన్న ఒంటరి బ్రతుకులోకి నెట్టేసింది.

నాగమణి తన గదిలోకివెళ్ళి కూర్చుంది.

ఇవ్వాళ ఎందుకో తనివితీరా ఏడవాలనిపిస్తోంది. ఇతరులను చూసి జాలిపడి సానుభూతి చూపించే తను, యివ్వాళతనమీదతనే జాలిపడి సానుభూతి చూపించుకోవాలి. గదిలో తనొక్కర్తేవుంది. మిగతావాళ్ళు హాస్పిటల్లోకి వెళ్ళిపోయారు. ఏడవటానికి కావలసినంత తీరికా, అవకాశం.

పదిన్నరకు భోజనంచేసి, గది తలుపులు బిగించుకుని మంచం మీదకు చేరింది.

అర్ధగంట తర్వాత, జ్ఞాపకాల సుడిగుండంలో ఉక్కిరి బిక్కిరౌతున్న ఆమెను రక్షిద్దామన్నట్టు ఎవరో తలుపులు దబదబా బాదుతున్నారు. నాగమణి లేచివెళ్ళి తలుపుతీసింది.

పక్కరూము ప్రమీల ఉత్తరం వచ్చిందని కవరొకటియిచ్చి వెళ్ళిపోయింది.

నాగమణి ఉత్తరం చించి చదువుకుంది. చెల్లెలు రాసిన ఉత్తరం అది. డబ్బుగురించి. అమ్మకు తెలియకుండా తన పేరున ఓ యాభై రూపాయలు పంపమని.

మళ్ళీ మంచంమీదకు చేరుకుంది నాగమణి.

తమ్ముడికి యిరవై రూపాయలు పంపించి యింకా వారంకూడా కాలేదు వాడికీ రహస్యంగానే. బూట్లకని.

బహుశా చెల్లెలు ఆ యాభై రూపాయలతోనూ ఏ చీరోకొనుక్కొంటుంది. లేదా ఏ ఎక్స్కర్షన్‌కో వెళ్తుంది. కేరింతాలు కొడుతూ తిరుగుతుంది. మా అక్కయ్య ఎంతమంచిదీ అనుకుంటుంది. తమ్ముడూ అంతే, తొడుక్కున్న బూట్లనిచూసి మురిసిపోతాడు. బళ్ళో అందరికీ చూపించి. మా అక్కయ్య డబ్బిస్తే కొనుక్కున్నాను అని చెప్తాడు.

అదే సంతృప్తి! లేకపోతే యీ జీవితంలోంచి ఎప్పుడో పారిపోయి వుండేది. ఈ ఒంటరి బ్రతుకు, ఆశలేని భవిష్యత్తు—ఇక్కడ తను ఉండేది కాదు.

రూమ్మేట్ వచ్చి, భోజనంచేసి, కాస్సేపు ఫిలింఫేర్ చదువుకుని మళ్ళీ డ్యూటీలోకి వెళ్ళిపోయింది.

నాగమణి అంతసేపూ కళ్ళుమూసుకుని నిద్రపోతున్న దానిలా నటించింది. లేకపోతే ఒకటే వాగుడు. ఈ మూడ్‌లో ఆమె వాగుడు తను భరించలేదు.

ఉత్తరం మళ్లీ మరోసారి చదువుకొంది. ఈ సంతృప్తి ఎందుకు? మరొకరి సుఖంకోసం తన సుఖాన్ని త్యాగం చేస్తున్నందుకు. త్యాగం కాదనుకుంటే—అర్పణ. తన వాళ్ల ఆనందానికి తన జీవితాన్ని అర్పణ చేయడం. వెలుతుర్ని యివ్వాలంటే వత్తి కాలాలి. తన జీవితమూ అంతే. ఇంకొకరికి సుఖానికి తను ఆహుతి కావాలి.

మనసంతా బరువుగావుంది. దుఃఖ మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. చీకటి పేరుకుపోయింది. ఒకదాని నొకటి ఢీ కొని అగ్ని శిఖల్ని కురిపిస్తున్నాయి. కాని....కాని....మేఘాలు వర్షించడంలేదు. వర్షిస్తే బావుండును. హృదయం తేలికయ్యేది. తృప్తిగా ఏడుద్దామనుకుంటే కన్నీళ్ళుకూడా రావడంలేదేమిటి? ఏడవడంకూడా చేతగాదా తనకు? చిన్నప్పుడు వట్టినే ఏడ్చేసేది. పెరిగి పెద్దదయి ఏడవడం మర్చిపోయింది!

నిద్ర పట్టడంలేదు. కన్నీళ్ళు కారడంలేదు. అలానే మంచంమీద అటుయిటూ దొర్లుతోంది.

మళ్లీ తలుపు శబ్దం.

విసుక్కుంటూ వెళ్ళి తలుపుతీసింది.

ఆలిస్ విజయః తోటి స్టాఫ్ నర్సు.

చప్పున లోపలికివచ్చి కావలించుకుంది. "మణీః ఓ సంగతి చెప్పనా. ఇవ్వాళ ఆఫ్‌కదూ, ఉదయం షాపింగ్‌కని బజారుకు బయలు దేరాను. అనుకోకుండా బజార్లో క్రిస్టాఫర్ కనిపించాడు వాళ్ళింటికి తీసు కెళ్ళాడు. వాళ్ళమ్మగారికి పరిచయంచేశాడు. ఆమె చాలా మంచిది. నాచేత మూడు పాటలు పాడించుకుంది...."

విజయ కళ్ళలో క్రిస్టాఫర్ వెలిగించిన దీపాలు కనిపిస్తూనే వున్నాయి. ఆమె పెదాలమీద అతను అద్దిన తడి యింకా మెరుస్తూనే వుంది; ఆమె చెక్కిళ్ళమీద అతను పులిమిన రంగు పాలిపోలేదు.

"నువ్వు అదృష్టవంతురాలవు విజయా" అంది. మళ్ళీ వెంటనే "ఇవ్వాళ నాకు వంట్లోబావుండలేదు. కాస్సేపు నిద్రపోనీ" అంది.

ఆ అమ్మాయి ఓసారి ఆశ్చర్యంగా కళ్ళు ఎగరేసి దగ్గరికొచ్చి, వొళ్లంతా తడిమి చూసింది. పక్కనే కూర్చుని మీదకువంగి ఆప్యాయంగా నుదురుమీద చెయ్యేసి "తలనొప్పిగావుందా" అంది.

"తలనొప్పేగాని, కాస్సేపు పడుకోనియ్, నీకు పుణ్యముంటుంది" అంది నాగమణి.

ఆమె ధోరణికి విజయ ఆశ్చర్యపోయి ముఖం చిన్న బుచ్చుకుని వెళ్ళిపోయింది.

తను అసూయ పడుతున్నా ననుకుంటుంది విజయ. తను దేవత కాదు, మనిషి. అందులో ఆడది. అతిసామాన్యమైనది ఏ ప్రత్యేకతా లేనిది. రాగద్వేషాలకు అతీతురాలుకాలేదు. పగిలిపోయిన గాజుబుడ్డీలాంటి జీవితం అయిపోయింది. అతికిస్తేమాత్రం ఏం లాభం. మళ్ళీ వేడి తగిలితే విచ్చిపోక తప్పదు. అబ్బా, గుండెచీలిపోతోంది. బాధ. గుండెలు మండిపోతున్నట్టు, పిడికిట్లో గుండెబిగించి అణిచినట్టు. తలనొప్పి నిజంగా వస్తోందిప్పుడు. ఆలోచించడం మానేస్తే. నిద్రపోవాలి. నిద్ర రాదు. కన్నీళ్ళు కారవు.

సాయంత్రం వరకూ అలాగే గడిపింది. చీకటిపడ్డాకలేచి ముఖం కడుక్కుంది. భోజనంచేసి, బట్టలు మార్చుకుని డ్యూటికి బయలుదేరింది.

క్వార్టర్సు మసక చీకట్లో నక్షత్రాల్లా చిరునవ్వులు; రహస్యంగా, తేలిగ్గా గుసగుసలు; ఎవరికివారే ఓ సామ్రాజ్యాన్ని ఏలుతున్నారు. అందకుండా తప్పించుకుని జారిపోతున్నారు. ఎదుటి వాళ్లను ఓ ఆట ఆడించి నవ్వుకుంటున్నారు. లొంగిపోతున్నారు.

నాగమణి తలవంచుకుంది. "వద్దు నాకీజీవితం వద్దు" అనుకుంది. వంచినతల ఎత్తకుండా సన్నని బాటలోంచి గబగబా నడిచి హాస్పిటలు చేరుకుంది.

ఓ సారి నాగమణి వార్డంతా కళ్లతో వెతికింది. కొంతమందిగురించి ప్రత్యేకంగా అత్రుతతో చూసినకళ్ళు, వారిని సురక్షితంగాచూసి, మెల్లగా కిందకు వాలాయి. నిన్నచేరిన దురదృష్టవంతుడు పడుకునే, ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

నాగమణి ఓసారి వార్డంతా చుట్టివచ్చింది. రిపోర్టుచూసి, ఎవరె వరికి యింజక్షన్లు ఇవ్వాలో యిచ్చివచ్చింది. దురదృష్టవంతుడ్ని పలక రించి నొప్పెలావుందో అడిగింది.

"అలాగేవుంది"అన్నాడు. కీచుగొంతు. అసలు ఆ గొంతే అంతో, లేక స్వరపేటికకూడా కాలి అలా అయ్యిందో తెలీదు. ఆ అందానికితగ్గ కంఠంకాదు.

అతనితో మాట్లాడుతోన్న యాభైయేళ్లవాడు లేచొచ్చి, ఆమెవెంట డ్యూటీ రూంలోకి నడిచాడు.

"నర్సమ్మా! అబ్బాయిని కాస్త కనిపెడుతూ వుండమ్మా. టెలిగ్రాంవస్తే పరుగెత్తుకొచ్చాను. మావాడే. మేనల్లుడు. డాక్టరుగార్ని అడిగాను. ఫరవాలేదన్నారు. నే వెళ్ళిపోతున్నా. మా అమ్మాయిపెళ్ళి పదిహేను రోజులుకూడా లేదు. దగ్గరుండి అన్నిపనులూ చేసుకోవాలి. ఒంటరివాడ్ని. పెళ్ళికి రారా అని వుత్తరంరాస్తే నన్నేరప్పించాడు వీడు. ఏదో, అదృష్టంబావుండి గండం గడిచింది"అన్నాడు.

ఇంకా చాలా చెప్పాడతను. చిన్నప్పుడే వొంటరివాడయిపోయాడట. చదువూ, సంధ్యా అన్నీతనే చూసుకుంటున్నాడట. పేరు వసంత రావుట.

ఆయన ఒకటికి పదిసార్లు వసంతరావును చూస్తుండమని ఆమెతో చెప్పి వెళ్ళిపోయాడు.

నాగమణికి వసంతరావుమీద జాలికలిగింది. ఒంటరి బ్రతుకు— పాపం! అనుకుంది. గ్లూకోజు యింజక్షన్లు యిద్దామని సిరంజ్ పట్టుకొని

వచ్చింది. అన్నం తినగూడదన్నాడు డాక్టరు. అన్నమే కాదు. ఘనపదార్థాలేవీ తినగూడదు....గ్లూకోజు యింజక్షన్లే ఆధారం.

ఆమె వచ్చేసరికి దుప్పటి ముసుగుపెట్టి పడుకున్నాడు. ముఖం మీంచి దుప్పటి తొలగించింది. ఏడుస్తున్నాడు. జలజలా కన్నీళ్ళుకారి పోతున్నాయి!

"ఏమిటి! ఏడుస్తున్నారా!! ఎందుకు?" అంది ఆమె.

పంటితో కింద పెదవి బిగించి పట్టుకుని బలవంతంగా రెప్పలెత్తి ఆమె ముఖంలోకి చూశాడు. ఆ వెంటనే రెప్పలుదించి "బాధ....చాలా ఎక్కువగా వుంది" అన్నాడు.

ఇంజక్షనిచ్చి, చూపుల్ని తప్పించకుండా ఓ నిమిషంసేపు అలానే అతని ముఖంలోకిచూస్తూ వుండిపోయింది. వసంతరావు మధ్యలో ఓసారి కళ్ళుతెరిచి, ఆమె చూస్తుండడంచూసి, మళ్లీ మూసుకున్నాడు.

నాగమణికి ఏదో అర్థమైనట్టు కళ్ళు ఎగరేసి అక్కడనుండి కదలి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ఆమె ఆలోచనల్లో అతను కొద్దిసేపు మెదిలినప్పుడు ఆమె అనుకుంది——

తనలాగే అతనూ జీవితంలో ఓడిపోయాడు. దురదృష్టవంతుడు. కాని తనకు గుండెధైర్యం వుంది. అతనికి లేదు. ధైర్యవంతుడ్ననుకుని పిరికివాడిలా ప్రవర్తించాడు. నిజంగా జాలిపడాల్సిన జీవి!

లేచివచ్చింది. ముసుగుపెట్టుకునేవున్నాడు. దుప్పటి తొలగించింది. ఏడవడంలేదుగాని కళ్ళుమూసుకునే తెలిగేసి వున్నాడు. దుప్పటి తీయడంతోనే రెప్పలెత్తి ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూశాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? ఇంకా నిద్రపోలేదూ. పదకొండయ్యింది. కళ్ళు మూసుకుని పడుకోండి—ఏ ఆలోచనలూ లేకుండా. ఎంతసేపు ఆలోచించినా ఆ పెళ్ళిసిమీరు ఆపలేరు."

జడుసుకున్న వాడిలా గతుక్కుమని అదిరిపోయాడు. కంటి పాపలు క్షణంపాటు అల్లల్లాడినట్టు చలించిపోయాయి. మారు మాట్లాడకుండా కళ్ళు మూసుకున్నాడు. కళ్ళుతెరిచి చూస్తాడేమోనని చాలాసేపు ఆమె అక్కడే నిలుచునివుంది. కాని, అతను కళ్ళు తెరవలేదు.

నాగమణి అక్కడనుంచి వెళ్ళిపోతూ "మీరు ఆలోచించేదేమిటో నాకు తెలుసు. మోసగింపబడిన బాధతో మిమ్మల్ని మీరే మోసగించుకోవడానికి ప్రయత్నించారు మీరు చేసినపని మంచిపని అనలేను. పిరికివాళ్ళు చేసేపని అది. జీవితంలో పోగొట్టుకున్న ప్రతి విషయాన్ని గురించీ బాధపడుతూ కూర్చుంటే, విగ్రహం ముఖంలో చెక్కిన చిరునవ్వు తప్ప యీ లోకంలో మరో చిరునవ్వు కనిపించదు" అంది.

గదిలోకొచ్చి కూర్చుని కిటికీలోంచి ఆకాశంలో నక్షత్రాల్ని వెతుకుతూ యింతకు ముందు తానన్న మాటల్ని జ్ఞాపకం చేసుకుని నవ్వుకుంది. ఫరవాలేదు. నాకు నేను ధైర్యం చెప్పుకోగలను—అనుకుంది.

అంతకుముందు రాత్రీ, పగలూ సరిగా నిద్రలేనందువల్ల గాబోలు ఆరాత్రి ఆమెకు ఏ కలలూలేని మత్తునిద్ర పట్టేసింది. రోగులుకూడా ఎవరూ లేపలేదు. ఉదయం లేచేసరికి బాగా పొద్దెక్కిపోయింది. అప్పటికే చాలామంది రోగులు నిద్రలేచారు. వసంతరావుకూడా నిద్రలేచాడు. కళ్ళుతెరచి వార్డు సీలింగుకేసి చూపులు నిలిపి నిశ్చలంగా చూస్తున్నాడు. అలా చూస్తున్న వాడల్లా చటుక్కున చూపులు మార్చుకుని ఓ మారు అటూ ఇటూ చూశాడు. దూరంగా డ్యూటీరూం ఎదుట వరండాలో

నాగమణి వట్టిచేతుల్తో చెదరిపోయిన తలవెంట్రుకల్ని సర్దుకుంటూ యిటే చూస్తోంది.

"గుడ్‌మార్నింగ్ సిస్టర్?" అన్నాడు చేతులెత్తకుండానే.

"గుడ్‌మార్నింగ్" అంది. దగ్గరకొచ్చి పలకరించింది. నొప్పి ఎలావుందీ కనుక్కుంది. పదినిమిషాలు అతని ఎదుటే నిల్చుని మాట్లాడింది. ఏ కాలేజీలో చదువుతున్నదీ, ఏ క్లాసో, ఏ వూరో—చాలాచాలా మాట్లాడింది. స్త్రీ సహజమైన సానుభూతి ఆమెకు తెలియకుండానే ఆమెలోంచి పొర్లి అతనిమీద పన్నీటి జల్లులా కురిసింది. ఆమె అభిమానపు జల్లులోతడిసి, ఆమె స్నేహపుచూపుల్ని మత్తుగా వళ్లంతా కప్పుకున్నాడు. అతనిపై సానుభూతి చిలకరిస్తోన్న ఆమెకు చటుక్కున తన జీవితం గుర్తుకువచ్చి, మరేమీ మాట్లాడలేకపోయింది. గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది.

పగలుకూడా ఆమెకు మత్తుగా నిద్రపట్టేసింది. రాత్రి డ్యూటీలేదు. ఆరోజు ఆమెకు ఆఫ్. రూమ్‌మేట్ బలవంతంచేస్తే సినిమాకు వెళ్లింది. తెలుగు సినిమా అదీ. ఒక నర్సు జీవితాన్ని ఉన్నతంగా చూపించిన చిత్రం. అది చూసిన తర్వాత "ఇప్పుడు నన్ను నేను ఓదార్చుకోగలను" అనుకుంది. ఇంటికొచ్చి హాయిగా, నిశ్చింతగా నిద్రపోయింది. ఏవేవో కలలు వచ్చాయి. ఆ కలల్ని ఆమె పట్టించుకోలేదు. జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నించలేదు.

"వీటిన్నింటికీ మించిన సంతృప్తి నాకు వుంది. నాకు యింకేమీ అక్కరలేదు" అనుకుంది.

ఆరోజు మధ్యాహ్నం సేవింగ్స్ బ్యాంక్‌లోంచి డబ్బుతీసి చెల్లెలుకు స్కూలు అడ్రసుకు యాభై రూపాయలు మనియార్డరు చేసింది. సాయం

కాలం వరకూ నిద్రపోయి భోజనంచేసి హాస్పిటలుకు బయలుదేరింది. నల్లని చీకట్లో మెలికలుతిరిగిన సన్నని బాటలో హుషారుగా నడిచి వార్డు చేరుకుంది. అయిదు నిమిషాలు తీరిగ్గా కూర్చుని, ఆ తర్వాత ఒకొక్క రోగినే పరామర్శిస్తూ అటూ యిటూ తిరిగింది.

వసంతరావు తలగడకు ఆనుకుని కూర్చొనివున్నాడు. ఆమెను చూసి విష్ చేశాడు.

"ఎలావుంది నొప్పి?" అంది ఆమె చిరునవ్వు నవ్వుతూ దగ్గరకొచ్చి.

"నొప్పి ఎక్కువగానేవుందికాని అలవాటుబడిపోయాను" అన్నాడు.

బాగా చిక్కిపోయాడు. కళ్ళు లోతుకుపోయాయి. చూపులు అలసిపోయినట్టు మందంగా కదులుతున్నాయి. మీసమూ — గెడ్డం పెరిగిపోయి పాడుబడ్డ బంగళామీద నాచుపట్టినట్లుంది. విప్పుపయిన బూడిద చేరినట్టు ముఖం నల్లబడింది. దగ్గరకు రాగానే గుప్పున చెమటవాసన కొట్టింది. మరీ దగ్గరగా చూసినప్పుడు నొసటిమీద గీతల్లో చెమట చేరి నల్లని చారలు కత్తినాట్లులా కనిపించాయి.

"నిన్న మీరు రాలేదేం?" అన్నాడు వసంతరావు.

"నిన్న నాకు వీక్లీ ఆఫ్" అంది నాగమణి.

"ఉదయం పాతవాళ్ళు ఇద్దరుకాక మరోఆమె వచ్చింది. ఒకవేళ మిమ్మల్ని మరో వార్డులోకి మార్చేశారేమో అనుకున్నాను. వాళ్ళను అడుగుదా మనిపించిందిగాని మళ్ళీ అడగలేదు."

"అడగలేకపోయారా" అంది చిరునవ్వు నవ్వుతూ ఆమె.

అతనేమీ మాట్లాడలేదు.

"మళ్ళీ వస్తాలెండి తిరిగ్గా" అని వెళ్ళిపోయిందామె. గబగబా ఎవరికి యివ్వాల్సిన మందులు వాళ్ళకిచ్చింది. వసంతరావుకుకూడా గ్లూకోజు యింజక్షన్లు యిచ్చింది. యింజక్షన్లు యిస్తూ "పాపం! భోజనం లేక బాగా చిక్కిపోయారు" అని, సానుభూతి చూపుల్తోనే ఒళ్ళంతా స్పృశించి "ఏ ఒత్తాయి రసమో తాగగూడదూ" అంది.

"నిజమే, కాని ఎవరున్నారు తెచ్చేవాళ్ళు: కాలేజీనుంచి యీసారి ఎవరన్నా స్నేహితులు వస్తే వాళ్ళచేత తెప్పించుకోవాలి."

"రేపుగాని నేను వూళ్ళోకెళ్తే తెస్తాలెండి" అని ఆమె మరో రోగికి యింజక్షనివ్వాలని వెళ్ళిపోయింది.

నక్షత్రాలవంటి కలలు పండుతున్న ఆ రాత్రి హాస్పిటల్లో రోగులంతా నిద్రపోయాక, నిశ్శబ్దం హాస్పిటల్లో పరచుకున్నాక వసంతరావు నిద్రపోయాడో లేదో చూసొద్దామని అతనిదగ్గరకు వెళ్ళింది నాగమణి. కళ్ళు తెరచి చూస్తున్నాడు. అతనియవ్వనపు కళ్ళల్లో మొలిచిన నిరీక్షణల పూలు, ఆమె వస్తూ మోసుకొచ్చిన చిరుగాలులకు అటూయిటూ వూగి మరీ అందంగా, ఆకర్షణీయంగా కనిపించాయి.

"ఇంకా నిద్రపోలేదూ" అంది వస్తూనే.

"ఏమిటో ఇవ్వాళ యింకా నిద్ర రాలేదు. పొద్దుటినుండీ యిలా మంచంమీదే గడవడం. మిగతా పేషెంట్లంతా నా కెందుకో మాట్లాడ బుద్దే యదు — మీతోనేతప్ప. పట్టి వాగుడుకాయలు. అందుకని పగలంతా నిద్రతోనే గడవడం. రాత్రిళ్ళు కొద్దిపాటి నిద్రే."

కొన్ని వందల సంవత్సరాలనుంచి ప్రయాణంచేస్తూ వచ్చిన ఏ దూరతీరాల్లోని నక్షత్రపు కాంతి కిరణమో నిద్రపోతున్న ఓ పిల్ల కెర

టాన్ని కవ్వించి సంతోషంతో ఉరకలు వేయించినట్టు ఆమె హృదయంలో చిన్న అలను కదిలించాయి అతని మాటలు. చాలాచిన్న అల. క్షణంపాటు పైకిలేచి, ఊగులాడి, వడ్డుకు కొట్టుకొచ్చి చిరునవ్వుల నురగల్ని వదిలిపెట్టి మాయమయ్యిం దది.

"అదేమిటి అలా అంటారు. మీగతా సిస్టర్లని అలా చిన్నచూపు చూడకండి. నే నొక్కర్తినీ మంచిదాన్నీ, వాళ్ళు కాదూనా: వాళ్ళగాని ఆలకించారంటే బాధపడరూ?''

"వాళ్ళకూ, మీకూ చాలా తేడావుంది.''

చటుక్కున ఆమె అతని కళ్ళల్లోకి తేరిపార చూసింది. రాత్రి చీకట్లో దట్టమయిన గుబురులకింద వికసించినమల్లెమొగ్గలు రెండు, కాంతులతో తమను తాము వెలిగించుకున్నట్టు ఆమెకళ్ళు వికసించాయి.

"తేడావుందని నేను అనుకోవడంలేదు'' అంది ఆమె.

"ఉంది, మీరు చాలానిండుగా, గంభీరంగా వుంటారు'' అన్నాడు అతను.

జీవితంలో అన్నీ జారవిడుచుకున్నదాన్ని నేను. ఆరోగ్యంగా చిరునవ్వుకూడా నవ్వలేనిదాన్ని. అన్నీ పోగొట్టుకుని నేను మంచిదాన్నయ్యాను. ఈ నిండుదనం వెనక, ఈ గంభీరత వెనక మండిపోయిన గుండెను మీరు గుర్తించలేరు — అనుకుంది నాగమణి.

"సరేలెండి నిద్రపోండిక. పోనీ బ్రోమైడ్ తాగుతారా, నిద్రపడుతుందేమో. అయినా అస్తమానం తాగటం మంచిదికాదు.... నాకు నిద్రొస్తోంది. నేను వెళ్ళిపోతున్నాను.''

డ్యూటీరూంలోకి వచ్చేసింది. నిజానికి నిద్రవస్తోంది. చెకింగ్‌నర్స్ యింకా రౌండ్స్‌కు రాలేదు. వచ్చి వెళ్ళిపోతే, కొద్దిసేపు కళ్ళు మయ్యొచ్చు.

పాలసముద్రంలో మధ్యాహ్నపు సూర్యకిరణాలు వెలిగించిన అందమైన వింతకాంతిపరచుకున్నట్లున్న గదిలో ఒంటరిగాకూర్చుని కిటికీలోంచి ఆకాశవీపాన్ని చూస్తోంది. గదిబయట స్వీపర్, వార్డుబోయ్‌లు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సినిమాలగురించి. తెలుగు సినిమాలు అందులో, కొత్తగా వచ్చిన రంగుల సినిమాలో హాస్యపాత్రల సంభాషణల్ని గురించి.

మళ్ళీ ఆలోచనలమధ్య నాగమణి.

తన మనసెందుకలా ఉల్లిపొర కాగితంలా రెపరెపలాడుతోంది? సముద్రపు గాలిలోంచి విడివడి, కనివింద మొక్కలమీంచి జారి, చెరకు తోటలోంచి ప్రయాణంచేసి వచ్చిన పిల్లతెమ్మెరలా ఎందుకలా హాయిగా మత్తుగా వుంది? మైళ్ళకొలదీ దూరాల్లోంచి ఊగులాడుతూ వచ్చి, మొండిగా నిలుచున్న బండరాళ్ళ చుట్టూ చేరి కదలించాలని ప్రయత్నించే సముద్రపు అలలా ఎందుకలా ఆర్భాటం చేస్తోంది? మిగతా వాళ్ళలా తనూ అయిపోతోందేమిటి! తను అందరిలాంటిదికాదు. ఓ ప్రత్యేకత వుంది. ఆయనే అన్నాడు. వట్టిది. ఏ ప్రత్యేకతాలేదు. తను మోసగత్తె...

నాగమణి గట్టిగా రెండుచేతుల్తోనూ కళ్ళుమూసుకుంది. "వద్దు.... వద్దు.... ఈ మూసిన తలుపుల్ని నేనిక తీయలేను" అనుకుంది.

"ఏం చేస్తున్నావు నాగమణీ" చెకింగ్ నర్స్ గది బయటినుంచే పిలిచింది.

"ఏం చేయడంలేదూ. మత్తుగావుంటే నిద్రరాకుండా వుంటుందని కళ్ళు నులుముకొంటున్నాను."

లేచివెళ్ళి ఆమెను అనుసరించింది, వార్డుచుట్టూ ఓసారి తిరిగి ఆమె వెళ్ళిపోయింది.

నాగమణి గదిలోకి వెళ్ళబోతుంటే ఎక్కడనుంచో ఓ పిలుపు.

ఆగి వార్డులోకి చూసింది.

"సిస్టర్ ! నిద్రరావడంలేదు. బ్రోమైడ్ కావాలి."

ఆ కంఠం వసంతరావుది.

బొన్ను గ్లాసులో కాస్తంత బ్రోమైడ్ వేసుకుని వెళ్ళి అతనిచేత తాగించింది. దుప్పటి సరిగాకప్పి, నిద్రపొమ్మని కోప్పడి, గుడ్‌నైట్ చెప్పి వచ్చేసింది. ఫిలింఫేర్ చదువుకుంటూ అలానే టేబిలుమీదకు వాలి నిద్ర పోయింది.

ఉదయం వేగంగానే తెలివివచ్చిందిగాని, బద్ధకంగావుండి వెంటనే లేవాలనిపించలేదు. చాలాసేపు అలానే మత్తుగా చూస్తూ వుండిపోయింది ఆ తర్వాత లేచి గబగబా పనులు పూర్తిచేసింది. వసంతరావుకు సుప్రభాతం చెప్పి క్వార్టర్సుకు బయలుదేరింది.

పదడుగులుకూడా వెళ్ళలేదు, వార్డులోవున్న రేడియో సౌండ్ బాక్సులోంచి 'ఆజ్ పహలీ తారీఖుహై....' పాట వినవచ్చింది.

ఎవరో పట్టి బలవంతంగా వెనక్కుగుంజి నిలదీసినట్టు చటుక్కున ఆగిపోయింది నాగమణి.

అవును! ఇవ్వాళ ఒకటో తారీఖు. డ్యూటీలు మారేరోజు. మరో వార్డులోకి వెళ్ళిపోవాలి. ఎక్కడికో?

అప్రయత్నంగా ఆమె వార్డులో వసంతరావు పడకవైపుచూసింది. అతను యిటే చూస్తున్నాడు. అక్కడినుండి కదిలిందిగాని ఆమె మనస్సు మనస్సులో లేదు అద్దెకున్న వ్యక్తి గదివిడిచి వెళ్ళిపోతున్నప్పుడూ, ఎదురుచూసిన పుష్పం చేతికందని దూరంలో చెట్టు చిటారుకొమ్మన పూసినప్పుడూ, ఎక్కదలచుకొన్న రైలు దాటిపోయినప్పుడూ అస్పష్టంగా నిట్టూర్పుతో కూడిన బాధతో మూలిగినట్టే ఆమె బాధపడింది. అంతలోనే ఆమె హృదయాన్ని తడుముకుని, బలంగా అదిచేత్తో పట్టుకొని 'అందరి లాంటిదాన్నీకాదు నేను. నాలో ఒక ప్రత్యేకత వుంది. ఈ మూసిన తలుపుల బయట వున్నవారంతా నాకు సమానమే' అని తన్నుతాను ఓదార్చుకుంది. జారిపోతున్న మనో నిబ్బరాన్ని చిక్కబట్టుకోవటానికి దీనజన బాంధవి నైటింగేల్ పేరు పదిసార్లు మనసులోనే జపించుకుంది.

కాని ఆమె మర్నాటి వుదయం అదేవార్డుకు వస్తూ కళ్ళల్లో ఆనందపు దీపాలూ, పెదాలమీద చిరునవ్వుల తోరణాలూ తగిలించుకోకుండా వుండలేకపోయింది. ఆమెకు పగలు డ్యూటీ అదే వార్డులో వేశారట. వస్తూ వస్తూ ప్లాస్టిక్ సంచితో సంచెడు బత్తాయిలూ, ఆపిలు పళ్ళూ పట్టుకొచ్చి వసంతరావు కిచ్చింది.

"అదేమిటి!" అన్నాడు ఆశ్చర్యంగా.

"పగటి డ్యూటీ నాకు. ఇక్కడే" అంది.

"అదికాదు, ఇవి"

"పళ్ళు. మీగురించే" ఒక్కొక్క పండే తీసి బయట స్టూలు మీద పెడుతోంది.

సన్నగా పొడుగ్గా సాగినవేళ్ళు. యవ్వనపు ప్రాకారంలోంచి అక్కడక్కడ బైటికి తొంగి చూస్తోన్న రాణివాసపు దేవిడీ శిఖరాగ్రాలులా

శరీరపు అంగాలు, దేవిడీమీద పరచుకున్న మబ్బులాంటి తెల్లటిగౌను, కమ్మటి కూటికూర పౌడరు వాసన.....

వసంతరావు దృష్టి మార్చుకుని "ఇంత అభిమానానికి నేనుతగను. అనవసరంగా నా గురించి మీరు శ్రమపడుతున్నారు'' అన్నాడు. తల గడకింద వుంచిన పర్సులోంచి అయిదు రూపాయల నోటుతీసి ఆమె కిస్తూ ''ఇది వుంచండి, చిల్లరలేదు. మిగిలితే తర్వాత యిద్దురుగాని'' అన్నాడు.

ఆమె ఓ చూపు అతని ముఖంలోకి విసిరి, కొద్దిసేపు అతనికళ్లలో దాన్నివిలిపి ''సరే యివ్వండి'' అని ఆ నోటు అందుకుంది.

'' ఇంకేమన్నా కావాలంటే చెప్పండి. రేపు వచ్చేటప్పుడు పట్టు కొస్తాను'' అనిచెప్పి వింతగా వేలాడుతోన్న చూపులతోరణాల మధ్య నుంచి డ్యూటీ రూంలోకి వెళ్ళిపోయింది.

లోపల సువర్ణవుంది. ఆమె వార్డు మారలేదు. మిగతా యిద్దరు వర్సులూ మరో వార్డులోకి మారిపోయారు. కొత్తగా యిద్దరు వచ్చారు.

నాగమణి బుగ్గమీద మెల్లగా చిటికవేసి చిరునవ్వు నవ్వుతూ ''మొత్తంమీద ఘటికురాలవే'' అంది సువర్ణ.

ఆ నవ్వు చూస్తే నాగమణికి అసహ్యం వేసింది.

మారు మాట్లాడకుండా అక్కడనుంచి కదిలి తన పనిలో నిమగ్న మైంది.

అప్పుడప్పుడు సువర్ణ వ్యంగ్యంగా విసుర్లు విసిరినా నాగమణి చలించలేదు. అసలు వాటిని పట్టించుకోనేలేదు. ''ఈ రాగ ద్వేషాలకు

తను అతీతురాలు'' అన్న భావంతో తనను తాను ఉన్నతంగా వూహించుకుని సువర్ణవైపు ఓ నిర్లక్ష్యపు చిరునవ్వు విసిరేసి, ఆలోచనలు యింటివైపు మళ్ళిన వసంతరావుకు ఆత్మీయురాలిలా, స్నేహితురాలిలా, తల్లిలా ధైర్యంచెప్పి గర్వంగా, తృప్తిగా గుండెనిండా గాలిని నింపుకునేది.

వారంరోజుల తర్వాత వసంతరావును డిస్చార్జిచేశారు. అంతకు ముందు రోజు డాక్టరు చెప్పాడు. అప్పుడు నాగమణి అక్కడే వుంది. డాక్టరు వెళ్ళిపోయిన తర్వాత ''సంతోషం వసంతరావుగారూ! పునర్జన్మ ఎత్తారు మీరు. మోసపోయిన కళ్లతో లోకాన్ని చూడటానికి ప్రయత్నించకండి. మర్చిపోండి. లోకాన్ని వెలిగించే సూర్యచంద్రులున్నారు. వారు లేనప్పుడు ఎవరికివారే ఓ చిన్న దీపాన్ని వెలిగించుకోవాలి. మళ్ళీ యింకెప్పుడూ తెలివి తక్కువగా ప్రవర్తించకండి'' అంది.

కృతజ్ఞతతో అతని కళ్లు మెరిశాయి.

వెళ్ళిపోయే సమయానికి అతని కాలేజీమిత్రులు నలుగురువచ్చారు. పదకొండున్నర అయింది. నాగమణికి రెండున్నరవరకూ విశ్రాంతి. అయినా వెళ్ళలేదు. వార్డులోనేవుంది. వసంతరావు రోగులందరికీ విడి విడిగా చెప్పి వచ్చాడు. మిత్రులువెళ్ళి మూడు రిక్షాలు బేరమాడితెచ్చారు. వార్డుబయట నిలుచున్నాయవి. బయట మబ్బుకమ్మి చల్లగావుంది.

వసంతరావు బట్టలు మార్చుకున్నాడు. తల దువ్వుకున్నాడు. ఓసారి జాలిగా, ప్రేమగా వార్డంతా చూశాడు. మెల్లగా డాక్టరువద్దకొచ్చి "డాక్టర్! తిరిగి ప్రాణం మీరుపోశారు. అభిమానపు చన్నీటిని, ప్రేమ పిడల్ని కురిపించి వాడిపోతున్న మొలకని బ్రతికించారు. ఆత్మీయుడిగా, స్నేహితుడిగా నా క్షేమాన్ని కోరారు. మీరు చూపిన ఆదరానికి, చేసిన సేవలకూ కృతజ్ఞతలు. మిమ్మల్ని ఎప్పటికీ జ్ఞాపకం పెట్టుకుంటాను" అన్నాడు.

డాక్టరు వీడ్కోలు చిరునవ్వు నవ్వాడు.

తర్వాత సువర్ణ ఎవరికో బాండేజి కడుతోంది. వసంతరావు అక్కడకు వెళ్ళాడు. ఆమె చేస్తోన్న పని ఆపి అతనివైపు తిరిగింది.

"సిస్టర్! ప్రాణదానం చేశారు మీరు. వాడిపోతున్న నా జీవనలతకు అభిమానపు సలిలాల్నీ, ప్రేమనీడల్నీ కురిపించి బ్రతికించారు. బ్రతకడం ఎలాగో నేర్పారు. స్నేహితురాలుగా, ఆప్తురాలుగా నాకు సేవలు చేశారు. మీరు చూపిన ఆదరానికీ, అభిమానానికీ, చేసిన సేవలకూ సర్వదా నేను కృతజ్ఞుడ్ని, జీవితంలో మిమ్మల్ని మర్చిపోలేను" అతని కళ్ళల్లో కృతజ్ఞత. మాటల్లో బరువు.

తర్వాత మరో నర్సు.

అవే మాటలు. కొద్దిపాటి తేడా. అర్థం ఒకటే.

ఆ తర్వాత యింకో నర్సు.

ఆమెకూ అంతే!

మెల్లమెల్లగా నాగమణి తప్పుకుంది. డ్యూటీ రూంలోకి వచ్చి కూర్చుంది. ఎవరూలేరు. అంతా బయట వార్డులో పనుల్లో మునిగి వున్నారు. ఏకాంతం.

జోళ్ళ శబ్దం యిటేవస్తున్నట్లున్నాయి. ఆమె గుండెలు కంగారుగా కొట్టుకున్నాయి, రైలుబడ్డీపక్క కనివిందు మొక్క కంపించినట్టు. గుండె దడ, కంగారు, ముఖంమీద చెమట. ఊపిరి బిగపట్టింది.

వచ్చేశాడు. గదిలోకి తొంగిచూసి "ఇక్కడున్నారా! యిప్పటి వరకూ అక్కడే వున్నారుగా, ఎప్పుడొచ్చేశారు." దగ్గరగా చాలా సన్ని

హితంగావచ్చి నుంచున్నాడు. తలపైకెత్తిచూస్తే అతని ఛాతీ కనిపిస్తోంది. ఎముకలు నిండిన ఛాతీ. అరణ్యంలో పొగమంచులాగ దానిమీద పల్చటి నైలాన్ బుష్ షర్టు. గుండె ఎగరడంలేదు, అతనుకూడా ఊపిరి బిగపట్టాడేమో.

బయటినుంచి మిత్రుల పిలుపు.

తలపైకెత్తి "వెళ్తున్నారా" అంది.

"వెళ్తున్నాను. బాగా ఆలస్యం అయింది. మిత్రులు పిలుస్తున్నారు. సిస్టర్! ప్రాణదానంచేశారు. అభిమానపు సలిలాల్నీ, ప్రేమనీడల్నీ వాడి పోతోన్న నా జీవనలతమీద చిలకరించి బ్రతికించారు. బ్రతకడం ఎలాగో నేర్పారు. మీరు చేసిన సేవలకూ, చూపిన ఆదరానికీ నేనెంతో ఋణపడి వున్నాను. మిమ్మల్ని ఎప్పటికీ నేను మర్చిపోలేను. వెళ్ళొస్తాను. సెలవు" రెండు చేతులూ జోడించి, నమస్కారంచేసి గబగబావెళ్ళి రిక్షాఎక్కాడు. రిక్షా పాములాంటి బాటలో కదిలి వెళ్ళిపోతోంది.

నాగమణి నిలుచోలేకపోయింది. నాగరికతను కరిచేకాలంలాగ, దరిద్రుడి ఆకలిలాగ, చలివేంద్రపుజీవి యవ్వనంమీదికొచ్చే వార్థక్యం లాగ, కార్చిచ్చులాగ, తరంగంలాగ, పెనుగాలిలాగ దుఃఖం పొర్లుకొచ్చే స్తోంది. గబగబా క్వార్టర్సుకువెళ్ళి తలుపులు బిగించుకొని మంచంమీద వాలిపోయింది. కింది పెదవిని పంటితో గట్టిగాపట్టుకొని 'నేను నర్సును. వీటన్నింటికీ అతీతురాలను. నేను ఏడవకూడదు' అనుకుంటూనే భోరున వడగళ్ళలాంటి కన్నీటితో, బిగ్గరగా, ఎక్కిళ్ళమధ్య పిచ్చిదానిలా ఏడ్చేసింది!

తెలుగు విశ్వ విద్యాలయం
గ్రంథాలయం